# పాపం పరంధామయ్య

జనసమూహం బారులు బారులుగా ఆ మైదానం నిండిపోయింది.

ఆ నాటి 'సంతాప సభ' కు అధ్యక్షత వహించిన ఛైర్మన్ చలమయ్యగారు కుర్చీలో నుంచి లేచి, ''రెండు నిమిషాలు పరంధామయ్య గారి ఆత్మశాంతికి మనం ప్రార్థిద్దాం'' అన్నారు.

వేదికపై వున్న ప్రముఖులు, మిగతా వారు నిశ్శబ్దంగా నిలబడ్డారు.

నిశ్శబ్దం ఆ సభాసదులను చూచి వెర్రిగా నవ్వింది. ఆ నవ్వును తిలకించిన ఛైర్మన్‌గారు సభను ప్రారంభించారు.



ప్రముఖులు-శ్రీ పరంధామయ్య జీవిత విశేషాలు ఉపాధ్యాయుడుగా ఆయన చేసిన సేవ విడమరచి చెప్పారు.

ప్రముఖులు ఉపన్యసించిన తరువాత ఛైర్మన్ గారు ఉపన్యసిస్తూ ''మొన్న ఈ చేతులతో సన్మానించాను. అదే చేతులతో సంతాప సభ జరిపించడం శోచనీయం. అందుకు చింతిస్తున్నాను.''

''ముఖ్యంగా పరంధామయ్యగారు ఆదర్శ ఉపాధ్యాయులే గాక, ఈ నాటి యువ ఉపాధ్యాయులకు మార్గ దర్శకులు. ఈ నాడు యువతులు కూడా యువకులతో సమానం .... మగవారితో

వి. వరలక్ష్మి

పాటు స్త్రీలు కూడా చదువుకొని ఉద్యోగాలు చేయాలని ఆశించాడు ఆ ఆదర్శ వ్యక్తి!" మరణించే కొద్ది క్షణాలముందు తన కుమార్తె పరీక్ష ఫీజు ముప్పై రూపాయలు కట్టాలి ఇవ్వమని నా వద్దకు వచ్చారు. కాకితో కబురంపితే నేనే పంపేవాణ్ణి కదా అని నలభై రూపాయలు యిచ్చి పంపాను. కాని....."

వేదిక క్రింద నుండి విద్యార్థులు కొందరు "మాటల్లో త్యాగం చేతల్లో స్వార్థం!" అని అందరికి వినబడేటట్లు నినాదాలు చేశారు. పరంధామయ్య నినాదాలు వినబడనట్లు గొంతు సవరించుకొని, "కాని .... నా వద్ద నుండి పోయిన తరువాత కొద్ది క్షణాలలో మరణించినారని నా చెవిన పడింది."

కంటికున్న అద్దాలు చేతికి తీసుకొని తువాలుతో శుభ్రపరిచి మళ్ళీ యథాస్థానంలో ఉంచుకొని "మన పరంధామయ్యగారు చనిపోయే ముందు కూడా ఆడపిల్లలను చదివించాలి అని అంటూ చనిపోయాడు. అందుకు అతని మాట మనం నిలబెట్టాలి. భార్య, తొమ్మిదిమంది పిల్లలు—సంసారం జరగడం కష్టంగా వుంది. అందుకు వారి కుటుంబానికి విరాళాలు ఇవ్వవలసిన బాధ్యత మనపైనుంది. అందుకు నా విరాళం మూడు వందలు."

మళ్ళీ వేదిక క్రింద నుండి కొందరు యువకులు "బ్రతికున్నప్పుడు ముప్పై రూపాయలు యివ్వలేదుకాని చనిపోయినప్పుడు మూడు వందలు ఇస్తే ఏం లాభం?" అని అరిచారు.

ప్రజలు కొందరు వేదికపైకి వెళ్ళి విరాళాలు—ఐదులు, పదులు – తమకు ఇష్టమున్నంత యిస్తున్నారు. కొందరు ఏమీ పట్టించుకోకుండా సభనుండి లేచి వెళ్ళుతున్నారు. ఓ అరవై ఏండ్లు నిండిన ముసలిది అక్కడి నుంచి వెళ్ళిపోతూ తనలో తాను 'పాపం! పరంధామయ్య చచ్చి ఏలోకాన ఉన్నాడో అతని పేరు చెప్పుకొని వాళ్ళు ఎంతెంత పంచుకుంటారో' అని గొణుక్కుంటూ సభ లైట్ల వెలుతురు దాటి చీకటిలోకి అడుగు పెట్టింది.

*

రోడ్డు కాలిపోతూంది. ఎండ మండిపోతున్నది. పరంధామయ్య కడుపు కాలిపోతూ వుంది. పరంధామయ్య నడుస్తున్నాడు. కాళ్ళకు చెప్పులు లేవు. క్రింద కాళ్ళు కాల్తున్నాయి. నెత్తిన గుడ్డ లేదు. పైన తల మాడుతున్నది. దగ్గరే మర్రిమాను నీడ చల్లగా ఉంది. అయితే ఆ నీడ పరంధామయ్యని నిలపలేక పోయింది. కారణం పరంధామయ్యకి ముప్పైరూపాయలు కావాలి. సాయంకాలం లోపుగానే దాన్ని సంపాదించాలి. లేకపోతే వేదవతి ఈ సంవత్సరం పరీక్ష వ్రాయలేదు. అందుకే మండే ఎండను, కాలే కడుపును మరిచిపోయి ఆదరా బాదరా వెళ్తున్నాడు.

పరంధామయ్య వయస్సు అరవై దాటింది. కాని షష్టిపూర్తి చేసుకోలేదు. రోజూ మంచంలో మూల్గే ఆయన భార్య జానకమ్మ ఆయన లోకం. బ్రతకలేక బడి పంతులుగా రిటైరయిపోయాడు. పదవీ విరమణ చేసిన రోజున పరంధామయ్యను అందరూ పూలమాలలతో సత్కరించారు. మునిసిపల్ ఛైర్మన్ పరంధామయ్యను ఎంతగానో పొగిడాడు; పరంధామయ్య లాంటి ఉపాధ్యాయులు అరుదని వ్యాఖ్యానించాడు.




కుట్టడానికి ఉపయోగించే సూది తుప్పు పట్టిందని విచారించనక్కరలేదు. దాన్ని సబ్బు ముక్కలో గుచ్చి ఉంచితే, మళ్ళీ ఉపయోగించడానికి పనికి వస్తుంది.

ఆ రోజు పరంధామయ్యకు ముప్పైరూపాయలు కావాలి. ఛైర్మన్ జ్ఞాపకం వచ్చాడు. ఆ దినమంతగా తనను పొగిడాడు కదా! వెళ్ళి అడుగుదామని నడక ప్రారంభించాడు. అంతకు ముందుగా వారం రోజులనుండి ఎందర్ని డబ్బులడిగాడో తనకే జ్ఞాపకం లేదు. ఎక్కడికి పోయినా చుక్కెదురే!

పరంధామయ్యకు ముప్పైరూపాయలు దొరక్కపోవడం ఎంతో ఆశ్చర్యం కలిగించింది. తనకు ముప్ఫయి రూపాయలు దొరకలేదు! మరి తక్కిన వాళ్ళంతా మేడలమీద మేడలు ఎలా కడుతున్నారు అనుకున్నాడు.

అలా ఆలోచిస్తూనే ఛైర్మన్ చలమయ్య ఇంటికి చేరుకున్నాడు. ఛైర్మన్ పెంపుడు కుక్క మొరగడంతో ఈ లోకంలోకి వచ్చాడు పరంధామయ్య. గేటుమీద "కుక్కలు వున్నాయి జాగ్రత్త" బోర్డు చూసి ఆగాడు.

వరండాలో యింటి నౌకరు కాళ్ళు కునికిపాట్లు పడుతున్నాడు. "అయ్యా!" అని కేక పెట్టాడు పరంధామయ్య. కడుపులో ఏమీలేదు ఆ కేక గొంతులోనే నిలిచిపోయింది. తన కేక తనకు తప్ప ఎవ్వరికీ వినబడలేదేమో!

ఈసారి కుక్క మరింత గట్టిగా మొరిగింది. కుక్క అరుపుకు నౌకరు లేచాడు. పరంధామయ్యను చూసి 'ఎవరయ్యా' అని తాను కునుకుతూ కూచున్న చోటి నుండి విసురుగా అరిచాడు.

'ఎవరంటే ఏం చెప్పాలి?' అని మనసులో అనుకొని "నేను పరంధామయ్యను" అని పైకి అన్నాడు.

"ఆఁ!" అన్నాడు నౌకరు అర్థంకాక.

మళ్ళీ చెప్పాడు.

"ఏ పరంధామయ్య? సరే ఏం పనిమీద వచ్చావు?"

"అయ్యగారితో మాట్లాడాలి."

"అయ్యగారంటే పెద్దయ్యగారా! చిన్నయ్యగారా! ఏ అయ్యగారు కావాలి?"

"నాకు....ఛైర్మన్ అయ్యగారు కావాలి."

"అబ్బా! పెద్దాయనతోనే పని!"

"నాయనా! ముందు గేటు తెరు! అసలే గచ్చునేల కాళ్ళుకాలి పోతున్నాయి" దీనంగా అడిగాడు పరంధామయ్య.

"పో పోవయ్యా! మహా వచ్చాడు పెద్ద మనిషి! ఎండప్రొద్దున అయ్యగారు నిద్రపోక నీకోసం మేలుకొని వుంటాడా? పో పో!"

మొరిగే కుక్క-కన్న వికృతంగా అరిచాడు నౌకరు. పరంధామయ్య నిట్టూర్చాడు. ఆయన దృష్టి అంతా ముప్పై రూపాయిల మీదే వుంది. ఎలా సంపాదించాలి? ఈ రోజు సాయంకాలం లోపు సంపాదించాలి. ఎలా? ఎలా?? ఎలా???

అంతలో ఒక కారు దూసుకుంటూ గేటు దగ్గర ఆగింది.

నౌకరు, కారు రావడం చూసి పరుగెత్తుక వచ్చి గేటు తెరిచాడు.

ఛైర్మన్ కొడుకు తూలుతున్నాడు. జేబులోంచి వందరూపాయిలు తీసి డ్రయివర్‌కి యిచ్చాడు.

"డ్రయివర్! వందరూపాయిలు బ్లాస్టార్ బార్ వాడికి నేను ఇచ్చానని ఇచ్చేయి" అని చెప్పి తూలుతూ ఇంట్లోకి వెళ్ళాడు.

కారు వెళ్ళిపోయింది. గేటు మూతపడింది.

నౌకరు మళ్ళీ బొమ్మని కనిరాడు.

సరే! మళ్ళీ వద్దామని పరంధామయ్య దగ్గర లోనే వున్న బంకు దగ్గరికి వెళ్ళాడు. బంకు దగ్గర కానుగమాను నీడ తల్లిప్రేమలా చల్లగా వుంది. బండ మీద కూర్చున్నాడు. ఆకలి చచ్చిపోయి చాల రోజులు అయిందేమో! దాహం మాత్రం వేస్తూంది. బంకు సాయిబును చూశాడు. అది చాలా చిన్న బంకు. సోడాలు వున్నాయి. సిగరెట్లు వున్నాయి. అరటిపండ్లు త్రాడుకు వేలాడు తున్నాయి. బానలో నీళ్ళున్నాయి. నీళ్ళు త్రాగుదా మని వచ్చాడు పరంధామయ్య.

ఎవరో ఒకాయన వచ్చాడు.

"సాయిబూ! కొంచెం నీళ్ళు ఇస్తావా?"

"ఏయ్! యిది చలీంద్ర అనుకున్నావా! నీళ్ళు దానం చేస్తే మా సోడాలు మా నాయనా త్రాగుతాడూ! పోపోయ్యా!" అని సాయిబు కసురుకున్నాడు.

నీళ్ళ మీద ఆశపోయింది పరంధామయ్యకు. నిజమే–నీళ్ళు అందరికీ ఇస్తే ఆ సాయిబుకు వ్యాపారమెలా అవుతుంది?

అలాగే నాలుక పిడచగట్టుకుంటున్నా ఓపికతో సహించాడు పరంధామయ్య.

గంట మూడైంది. సూర్యుడు కొంచెం వాలాడు. వేడిగాలులు వీస్తున్నాయి. పరంధామయ్య లేచాడు. మళ్ళా చైర్మన్ యింటికి బయలుదేరాడు. ఆకలికి, దాహానికి ఒళ్ళు తేలిపోతూంది. చైర్మన్ లేచాడు. కాబోలు. కుక్కకు బిస్కెట్లు విసిరేస్తూ వరండాలో తిరుగుతున్నాడు. గేటు దగ్గర నౌకరు లేడు. కుక్కను కట్టిపెట్టారు. పరంధామయ్యకు ఆనందం కలిగింది. నేరుగా కాంపౌండులో అడుగుపెట్టాడు.

చైర్మన్ ఎవరన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు. పరంధామయ్య "నమస్కారమండీ! నేను పరంధామయ్యని" అన్నాడు.

"ఏ పరంధామయ్య?" చైర్మన్ ప్రశ్నించాడు.

"నేను టీచర్ పరంధామయ్యని."

"ఏమో! ఆఁ సరే ఎందుకొచ్చావు?" నిర్లక్ష్యంగా వుందా కంఠధ్వని. 'అదేమిటి ఏమో అంటారు? ఆ రోజు నాకు శాలువను కప్పి యింత గొప్ప ఉపాధ్యాయుడు రిటైర్ కావడం దురదృష్ట మన్నారే. అప్పుడే మరిచిపోయారా!' అనుకొని మనసులోనే బాధగా మూల్గాడు పరంధామయ్య.

"మా అమ్మాయికి ఫీజుకు డబ్బు కావాలండి! ఒక ముప్పై రూపాయిలు సర్దితే...."

"ఏమిటయ్యా! నేనేం సన్యాసిని అనుకున్నావా! మేం చేస్తున్నదీ సంసారమే! అయినా యిక్కడేం డబ్బులు అచ్చువేయడం లేదు. నీ అమ్మాయికి ముప్పై రూపాయిలు లేక చస్తూన్నావా! మా అమ్మాయికి ముప్పై వేలు యివ్వలేక నే చస్తున్నా! అసలు ఆడపిల్లలకు చదువులు ఎందుకయ్యా–అందులో మీలాంటివాళ్ళకు–ఇంట్లో పొయ్యికాడ కూర్చోకుండా? వెళ్ళు. వెళ్ళు. ఒరే రంగన్నా. గేటువేసి టామీకి మాంసం తెచ్చి వెయ్యి" అంటూ తిరిగి చూడకుండా లోపలికి వెళ్ళాడు చైర్మన్.

పరంధామయ్య గుండెల్లో పిడుగుపడింది. ఆడపిల్లలకు చదువెందుకు అనే మాట విని అతని మనసు తరుక్కుపోయింది. 'ఎలాగైనా చదివించాలి. అందులో నాలాంటివాళ్ళు తప్పక చదివించాలి. అప్పుడు ఈ పెద్దమనుషులు చూచి ఏడ్వాలి. అందుకు....నేనేం చెయ్యాలి' అనుకుంటూ వెళ్ళాడు పరంధామయ్య.

చైర్మన్ యింటి ప్రక్కనే 'హాస్పిటల్' అన్న ఎర్రని అక్షరాలు కనిపించాయి.

"రక్తదానం చేయండి. తగిన రొక్కం చెల్లించబడును."

మెరుపులా ఆలోచన తట్టింది పరాంధామయ్యకి. 'తన రక్తం అమ్మితే....అవును' మరుక్షణం డాక్టరు ముందు నిలబడ్డాడు పరంధామయ్య. రక్తం యిచ్చాడు. నలభై రూపాయలు వచ్చింది. సంతోషంగా తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. లేచి అడుగులు వేశాడు.

పరంధామయ్య కళ్ళుతిరుగుతున్నాయి. కాళ్ళు తడబడతున్నాయి. త్వరగా వెళ్ళాలి. అమ్మాయికి ముప్పై రూపాయలివ్వాలి. అడుగులు వేస్తూనే వున్నాడు. అసలే వయస్సు మీరింది. ఆకలి శరీరాన్ని తినేసింది. దాహం మితి మీరింది. రక్తం పోయింది. పరాంధామయ్య త్రాగుబోతులా తూలుతున్నాడు. రమేష్ టాకీసు దాటాడు. అంతే–నరాలు స్వాధీనం తప్పాయి. తూలి క్రింద పడ్డాడు. అప్పుడే వచ్చిన నల్లకారు చక్రాలు పరాంధామయ్యని నలిపి వేశాయి. పరంధామయ్య చెయ్యి జేబు మీదే వుంది. జేబులో నాలుగు పదులు భద్రంగానే వున్నాయి. పరంధామయ్య ప్రాణం బొందిలోనుంచి ఎప్పుడో ఎగిరి పోయింది. *

## గేయం: మార్గదర్శకులు

అమ్మా, పలకా బలప మియ్యవే బడికిపోతాను
బడిలోన ఎన్నెన్నో నేర్చుకొంటాను

అన్నయ్యంతయ్యాక బడిని ఎగ్గొట్టి సినిమాకు పోతాను
చిన్నాన్నంతయ్యాక సిగరెట్టు తాగుతూ బలాదూరు తిరుగుతాను
నాన్నంతయ్యాక పార్టీలిచ్చి పీకలదాకా తాగుతాను
లంచాలు తీసికొని ఉద్యోగాలిస్తానే నేను పెదన్నాన్నంతయ్యాక

అమ్మా, పలకాబలప మియ్యవే బడికిపోతాను
బడిలోన ఎన్నెన్నో నేర్చుకొంటాను!

—పి. ప్రసూనారెడ్డి